# సరికొత్త జబ్బు

డాక్టరుగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

మరోసారి చేతిలోఉన్న రబ్బరు గొట్టాన్ని రోగి గుండె దగ్గర్నించి పొట్టదాకా అక్కడక్కడ పరీక్షించి మళ్ళీ గుండెల దగ్గర ఆపి మొదటికంటే కొంచెం జాగ్రత్తగా పరీక్షించడం మొదలు పెట్టాడు గడియారంలోకి చూస్తూ. రెండు నిమిషాలయింది. కాని ఎక్కడా మార్పు కనబడలేదు. తలకాయ ఆడించాడు ఆ పక్క నుంచున్న వాళ్ళ మొహాల్లోకిచూస్తూ. పెదిమలు వాటంతటవే కిందది ముందుకీ పైకి వెనక్కీ కదిలాయి.

'ఆ జబ్బేనంటారా?' పక్కన నుంచున్నముసలాడు కొడుకు మీద ఉన్న ఆదుర్దా అంతా మొహంలోచూపెట్టూ అడిగాడు.

> “ముందు ముందు ‘ప్రేమ’ కూడా ఒక విధమైన జబ్బులాగే చూడబడి మందుల ద్వారా కుదర్చబడుతుందని ఓ అమెరికా శాస్త్రజ్ఞుడి అంచనా. బహుశా గుండె జబ్బుల్లో చేరుస్తారేమో!”—(తెలుగు స్వతంత్ర)

'ఆఁ అల్లాగేఉందండీ. చాలా వరకూ ముదిరి పట్టుంది. ఇందాకట్నించీ చూస్తున్నాను. ఏ మాత్రం మార్పుకనబడటంలేదు. అయినా శక్తి కొద్దీ ప్రయత్నిస్తాను. అయితే యిన్నాళ్ళదాకా ఎందుకు అశ్రద్ధ చేశారు మీరు?' అన్నాడు కొంచెం కోపంగా, నుంచొని కోటుజేబులోంచి తీసిన పుస్తకం మీద ప్రిస్క్రిప్షన్ వ్రాసియిస్తూ.

'అబ్బే, యివాళ సాయంత్రం యెందుకో యిట్టే వాడి మొహంలోకి చూస్తే కొంచెం దిగాలుగా ఉన్నట్టుంది. అప్పుడే అనుకున్నాను ఆ రోగమేదో అంకురించిందిరా అని. 'ఏంబాబూ గుండెల్లో ఏమేనా నొప్పిగా ఉందా?' అని అడిగాను అప్పటికీ అనుమానం తీరక. 'హృదయ వేదనచాలా అధికంగా ఉంది నాన్నా!' అన్నాడు. యింకెందుకూ నా గుండెల్లో రాయి పడిందనుకోండి. వెంటనే మీక్కబురంపించాను. మీరూ వచ్చారు. యిందులో నా అశ్రద్ధ ఏముందో చెప్పండి డాక్టరుగారూ?' అన్నాడు ముసలాడు కోర్టులో నిర్దోషినని రుజువు పర్చుకోడానికి ఘోరంగా ప్రయత్నించే దోషిలాగ. “చిన్నప్పట్నించీ అనుమానంగానే ఉంది. ఒకవేళ మనవాడు మేష్టరుగారమ్మాయిని ప్రేమించటం గాని చేస్తున్నాడేమోనని”

'సరే లెండి, యిప్పుడెవళ్ళని ఏం లాభం! మహామహా మా డాక్టర్లే ఒక్కొక్కప్పుడు బోల్తా పడుతూ ఉంటారుసరిగ్గా వ్యాధి నిర్ధారణ చెయ్యలేక. అలాంటిది మీరు తెల్సుకోలేదని నేనెలా తప్పు పడ్తాను? ఇదంతా యీమధ్యనేవచ్చిందండీ. యీ మధ్యనే కనుక్కున్నారు మందులు కూడా. కాస్త వయస్సులో ఉన్న అమ్మాయినికాని దగ్గరకు రానిచ్చేరు సుమండీ!' అన్నాడు డాక్టరు ఓవేలు 'జాగ్రత్త' అనేట్టుగా ఆడిస్తూ, గుడ్లు పెద్దవిచేసి.

'ఏంబాబూ!' అన్నాడు ముసలాడుఆదుర్దాగా.

'భలేవారే, యింకా ఏమంటారేమిటి? ఇది మహా చెడ్డ అంటువ్యాధండోయ్. కాస్త పదిహేను పదహారేళ్ల పిల్లకాని దగ్గరి కొచ్చిందో, ఆ పిల్లకూడా యీ వ్యాధి యిట్టే వ్యాపిస్తుంది. యీ వ్యాధి వచ్చిన పిల్లదగ్గరికి ఎవరేనా కాస్త అటూ యిటూ వయసులో ఉన్నపిల్లాడు వెళ్ళినా సరే వెంటనే అంటుకుంటుంది. దీనినే యింగ్లీషులో (హైలీ కంటేజియస్) అంటారు' అన్నాడు డాక్టరు యింగ్లీషులో తనకున్న పాండిత్యాన్ని ప్రకటిస్తూ.

“శివి”

'అయ్యో! వాళ్ళు శారద రోజూ వస్తూ ఉంటుంటే? యివాళ నుంచీ రావద్దని చెప్పాలి. ఆనక వస్తే రానియ్యకు సుమా. సాయనా'' అన్నాడు కొడుకుతో.

డాక్టరు ఏదో ఆలోచిస్తూ నుంచున్నాడు. ఇదే సమయమనుకొని 'అయితే డాక్టరుగారూ, యీ రోగమెలా వస్తుందంటారూ?' అన్నాడు. సామాన్యంగా ముసలివాళ్ళకుండే కుతూహలం తోటి.

'ఆ? చెప్పమంటారా? అయినా న్యాయానికి వస్తే యిలాంటి రహస్యాలు చెప్పకూడదనుకోండీ. మీరేదో నేను ప్రాక్టీసు పెట్టినప్పట్నించీ ఉన్నవారు గనుక చెప్తున్నాను' అన్నాడు డాక్టరు ఏదో పెద్ద త్యాగం చేస్తున్న వాడిలాగ. మొన్న ఆస్పత్రిలో నర్సుని చెప్తా వినమని బతిమాలినా వినుపించుకోకుండా పోయింది. ఆ సంగతి తనకిమాత్రం జ్ఞాపకం లేదూ! అయినా అన్నాడు ఏదో గొప్పకి.

'అసలు మీరు చిన్నప్పుడు సైన్సులో కంటి రెప్పల్లో అనేక నరాలుంటాయనీ, వాటిని ప్రేమనరాలంటారనీ చదువుకున్నారు గదూ?' అన్నాడు పక్కనున్న కుర్రవాడికేసి చూస్తూ.

'అబ్బె, లేదండి. మాకెప్పుడూ అలాంటివి చెప్పలేదే!' అన్నాడు రోగి తమ్ముడు, కాబోయే మెడికల్ స్టూడెంటు. 'నేనెప్పుడూ అనుకుంటూనే ఉన్నా, మా మేష్టర్లంతా చెప్పేవి దొంగ చదువులేనని' అన్నట్టు చూస్తూ.

'చెప్పకపోతే చెప్పకపోనూ వచ్చు. బహుశా మీకందరికీ పాత సిలబస్ చెప్పిఉంటారు. అన్నట్టు యిదంతా కనిపెట్టి అయిదారేళ్ళైగా అవుతా!'

'ఎవరు కనిపెట్టారో?' అన్నాడు ముసలాడు.

'ఎవరో జర్మనీ డాక్టరొకడు కనిపెట్టాడట. ప్రత్యేకం అయిదారేళ్ళ కేసుల్ని పరీక్షిస్తూఉంటే గుండెకు సంబంధించిన వ్యాధులున్న వాళ్ళలో నూటికి ఎనభై అయిదు, తొంభై మంది తిరస్కరింపబడ్డ ప్రేమికులని తేలిందట. అప్పట్నించీ రాత్రింబవళ్ళు కష్టపడి మూడు సంవత్సరాలు పరిశోధనలు చేస్తే చివరికి ఓనిర్ణయానికి వచ్చాట్ట. ఇది గుండెజబ్బుకాదు, ప్రత్యేకంగా యిదొక రకమైన జబ్బు' అని. అందుకు నిదర్శనంగా మంచి బలమైన గుండె ఉండీ కూడా యీ 'ప్రేమవ్యాధి' చేత బాధపడేవాళ్ళని సవాలక్ష మందిని చూపెట్టాడు. ఆ సంవత్సరం ఆయనకి 'నోబెల్ ప్రైజ్' కూడా యిచ్చారేలెండి. ఇంతకీ అతను చెప్పిందేమిటంటే, కంటిరెప్పల్లో అనేకమైన నరాలుంటాయి. వాటికి 'ఏమరస్ నర్వ్' అనీ, 'ఎడ్మిరేషన్ నర్వ్' అనీ, 'సింపతైజింగ్ నర్వ్' అనీ, అలాగే పేర్లుంటాయి. ఇవన్నీ యిదిగో చూశారూ, యీ కనుబొమ్మల దగ్గర ఎముక ఉంది, దానిగుండా మెదడులోకి పోతాయి. పోయి అక్కణ్నించి గుండె వెనక భాగానికి వచ్చి సరిగ్గా ఊపిరితిత్తుల వెనకాల ఊపిరితిత్తులతో కలిసిపోతాయి. అందుకనే చాలా కాలంవరకూ యిదేదో గుండెకు సంబంధించిన రోగం అనుకుని పొరపాటుపడ్డారు డాక్టర్లంతా. అయితే యీ నరాలెలా పని చేస్తాయో చెప్పమంటారా, వినండి.

ఓ మంచి అందమైన అమ్మాయికేసి అదే పనిగా చూస్తామనుకోండి. అలా చూస్తూఉండగానే మన కళ్ళలోఉన్న 'ఎడ్మిరేషన్ నర్వ్' లో ఒక విధమైన చలనం బయలుదేరుతుంది. అంటే మనం ఆ అమ్మాయి అందాన్ని ఓ విధంగా మెచ్చుకోడం మొదలు పెట్టామన్నమాట. వెంటనే ఆ అమ్మాయికేసి చూడడం మానకపోతే ఏం జరుగుతుందో తెలుసా? ఆ 'ఎడ్మిరేషన్ నర్వ్' ఉన్నట్టుండి ఓమాదిరి 'డాన్సు' చెయ్యటం మొదలెట్టుంది. అప్పటికీ ఆ అమ్మాయిని చూడకుండా ఉండలేకపోతే ఆ నరం అలా డాన్సు చేసిచేసి పుటుక్కుమని తెగిపోతుంది. ఆ తెగడంలోనూ ఎక్కడ తెగుతుందనుకున్నారూ? ఖచ్చితంగా ఊపిరితిత్తుల వెనకాలే తెగుతుంది. అంటే రోగం మొదలెట్టిందన్నమాట.

'ఇంక ఆ అమ్మాయి కొంచెం యీడూ జోడూగా ఉంటే యీ 'అడ్మిరేషన్ నరం' డాన్సు చెయ్యటం మొదలుపెట్టి కాసేపటికి, అంటే రెండుమూడు క్షణాల్లో—యిది చెప్పడమంటే యింతసేపు పట్టోంది కాని, జరగడం క్షణాలమీద జరిగిపోతుంది లెండి—'ఏమరస్ నర్వ్' డాన్సు చెయ్యటం మొదలెట్టుంది. ఇంకా అలా చూస్తూఉండగానే అది కూడా డాన్సు

చేసిచేసి తెగిపోతుంది. ఇది తతిమా నరాలన్నిటి కంటే చాలా బలహీనమైంది. అందుకనే చాలా త్వరగా పుటుక్కు మంటుంది. ఇవి రెండూ కనక ఎప్పుడైతే తెగిపోతాయో అప్పుడు వ్యాధి మరింత ఎక్కువైపోతుంది. తతిమా నరాలుకూడా అలాగే పని చేస్తాయి. కాని సామాన్యంగా యీ 'ఏమరస్ నర్వ్' అంటే ప్రేమనరం ఉంది చూశారూ, అది తెగకపోతే అట్టే అంత బాధ అనిపించదు. కాని, సామాన్యంగా అదే ఎక్కువగా తెగిపోతూ ఉంటుంది.'

'అయితే, తెగిపోయిందీ లేందీ యెలా తెలుస్తుంది?' అన్నాడు ముసలాడు, ఉన్నవాడున్నట్టు ఊరుకోక.

'ఫొటో తీసిచూస్తారు లెండి.'

'ఎక్సరే ఫొటో' అన్నాడు కాబోయే మెడికల్ స్టూడెంటు-తన తెలివితేటలు తండ్రి ముందు గొప్పగా చూపెడ్దామని.

'కాదు. ఎక్సరే అవుతే ఇంతకాల మెందుకు పట్టేదీ? దీనికి ప్రత్యేకంగా లవ్-రే-కెమేరా అని ఉంటుంది' అన్నాడు కొంచెం విసుగ్గా డాక్టరు. మెడికల్ స్టూడెంట్ మూతి ముడుచుక్కూచున్నాడు.

'ఇంక వీటికి మందులుకూడా చాలావరకూ ఆ డాక్టరే కనిపెట్టాడు. ఏ నర్వ్ చెడిపోతే ఆ నర్వ్‌కి వేరే మందులున్నాయి. ఇప్పుడు 'ఎడ్మిరేషన్ నెర్వ్' చెడిందని అనుమానంగా ఉందనుకోండి. 'డోంట్-ఎడ్మయిర్' అనే బిళ్ళలిస్తారు. మనం తలనొప్పి వస్తే ఆస్ప్రో, సారిడాన్ బిళ్ళలు ఎలా వేసుకున్నామో అలాగే యీ బిళ్ళలు కాఫీతోగాని, వేడి నీళ్ళతో గాని వేసుకోవాలి. ఇంకా అప్పటికీ తగ్గకపోతే' లవ్-ఎడ్మిరేషన్' అనే పొడి మందుల్తో కలిపి యిస్తారు. ఇది యించుమించు మన క్లోరోఫారం లాగ పని చేస్తుంది. ఇదికూడా మామూలు మందులాగే రోజుకు మూడుసార్లు, పుచ్చుకునే మందు సీసా కుదిపి పుచ్చుకోవాలి. అలాగే 'ఏమరస్-నర్వ్' చెడితే 'డోస్టు-లవ్' అనే బిళ్ళలూ, 'లెస్-లవ్' అనే పొడీ, ఉన్నాయి. అప్పటికీ రోగం కుదరకపోతే, మొన్న మొన్నటిదాకా యిలాంటి రోగుల్నందర్నీ 'ప్రేమాసుపత్రి'కి పంపించేసేవాళ్ళు, కుదర్చడానికి వీలులేని పిచ్చి వాళ్ళని 'పిచ్చి ఆసుపత్రి'కి పంపించినట్టుగా. ఐతే ఓ రెండునెలల క్రితం ఉత్తర ధృవందగ్గర ఓ డాక్టరు, ఏ నరం తెగినా సరే, పని చేసేటట్టుగా 'హేట్-మీ' అనే కొత్తరకం యింజెక్షన్ కని పెట్టాడు. అది అచ్చం 'విరుగుడు'లాగ పని చేస్తుంది. అలా పని చెయ్యడంలో, సరిగ్గా అంతకు ముందెల్లా డాన్సు చేసిందో, ఆ తెగిపోయిన నరం అందుకు వ్యతిరేకంగా డాన్సుచేసి 'ఠకీ' మని అతుక్కుపోతుంది ఊపిరి తిత్తులకి. కాని అలా అతుక్కోవాలంటే, అరగంట అరగంటకీ ఒకటి చొప్పున ముప్పై నలభై యింజెక్షన్లదాకా ఇయ్యాలి. ఇంకా అప్పటికీ ఫలితం కనబడకపోతే ప్రేమాసుపత్రికి పంపెయ్యడమే. అప్పటికీ లంచాలుపెట్టి యిళ్ళల్లోనే ఉంచుకుంటున్నారనుకోండి.'

'ఉంచుకుంటే ఏం?' అన్నాడు ముసలాడు ఒకవేళ తన కొడుకునికూడా ఆ ప్రేమాసుపత్రికి పంపించెయ్యాలి కాబోలుననే భయంతో.

'ఇంకేముందీ యిందాకా చెప్పలేదూ యిది అంటువ్యాధి. 'హైలీ కంటేజియస్' అనీ? అందుకనే మొన్న మన ఆరోగ్యశాఖామంత్రి ఏమని ప్రతిపాదించారో చూశారా?'

'లేదండీ!'

'దేశంలోఉన్న ప్రతియువతీ యువకుడూ, జాతి, మత, కుల, వర్ణ విచక్షత లేకుండా 'హేట్-మీ' యింజెక్షన్లు తప్పని సరిగా చేయించుకుంటేనేగాని వారికిచ్చే రేషనుబియ్యం పంచదారా యివ్వకూడదని. అందు మూలాన లాభ మేమిటో తెలుసా! ఒకవేళ ప్రక్కనే ప్రేమరోగి ఉన్నా, ఏ ప్రేమరోగినేనా పరామర్శ చేయడానికి వెళ్ళినా త్వరగా యివతలి వాళ్ళకి ఆ వ్యాధి సోకదు. యీ మధ్య గ్రీన్లెండ్‌లో డాక్టరెవరో కృత్రిమ నరాలు తయారు చేస్తున్నాట్ట. అవిగనక పనిచేస్తే యీ ప్రేమరోగం చాలా వరకు తగ్గిపోతుంది దేశంలో. దీనికితోడు యీ (హేట్-మీ) ఇంజక్షనుకూడా యే 'బీసీజీ' యింజక్షన్లలాగ ఓ (ప్రచారం) బయలుదేరతీస్తే - యీ లోపుగా ఉన్న రోగాలని ఏదో విధంగా నయంచేస్తే రెండు మూడు సంవత్సరాల్లో మా దేశంలో ప్రేమరోగులు లేరు అని గర్వంగా తలెత్తి చెప్పుకోవచ్చు మనం'అన్నాడు

మంత్రిగారు. ఇంకేమంత్రి అంత సేవ చేస్తాడు దేశానికి. బహుశా ఆ ప్రతివాదనంతా ఒప్పుకో వచ్చు. మా గొప్పబుర్రలెండి మంత్రిగారిది...'

చటుక్కున ఆగిపోయాడు డాక్టరు. తన గుండెల్లో కూడా (ఎడ్మిరేషన్ నర్వ్) డాన్సు చేయడం మొదలెట్టిందేమోనని భయంతో.

లేదని పూర్తిగా నిర్ధారణకొచ్చాక 'ఇంక వెళ్తానండీ. ఆ మందు ఉపయోగించండీ. మళ్ళీ రేపొస్తాను. చాలాసేపు కూచున్నాను' అని వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

డాక్టరుగారు మందు మొదలెట్టిపదిరోజులైంది. ఏమీ గుణంకనపడలేదు. పైగాయెక్కువైనట్టుంది రోగం. ఒకసారి డాక్టరుగారికి తన 'యూమరోస్కోప్'(అచ్చం 'స్టెతస్కోప్'లాగ ఉంటుంది) చెడిపోయిందేమోనని భయమేసి తనగుండెలు పరీక్షించుకున్నాడు. బాగానేఉంది. ఏమీ తోచలేదు. ముసలాడికి ఏదో చెప్పి రోజులు గడిపాడు. రెండురోజులు ఏదో మందు పంపించేసి రోగిని చూడ్డానిక్కూడా వెళ్లలేదు.

మూడోరోజుని రోగి గదిలోకి వెళ్ళేసరికి డాక్టరుగారి గుండె 'ఝుల్లు'మంది. రోగి పక్కమీద లేడు. సరికదా- పక్కని కుర్చీలో కూచున్నాడు. కౌగిట్లో ఓ మంచి పదహారేళ్ళమ్మాయి ఉంది. ఇద్దర్లో ఎవరైనా డాక్టరుగారి మొహం కేసి చూస్తేగా! గబుక్కుని వెనక్కి ఆడుగేశాడు వెళ్ళిపోడానికి.

'ఏమండోయ్ డాక్టరుగారూ, వచ్చారా, మీకోసం కబురు పంపిద్దామనుకుంటున్నాను. మావాడి వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది లెండి. ఇంక మీ మందక్కర్లేదు. అసలు మొదట్లోనే ఆ ముసలాడు చెప్పిన మాటవింటే యీ దండగ కూడా లేకపోను' అన్నాడు రోగి తండ్రి సంతోషంగా.

'ఏమిటదీ ఎల్లాగ?' అన్నాడు డాక్టరు ఆదుర్దాగా. 'మా ముసలాడు చిన్నప్పట్నించీ చెప్తూనే ఉన్నాడండీ. వాడికి తెల్సింది, ఆలా ప్రేమతో బాధపడేవాళ్ళకి ఒక్కటే మందుంది అని. నే నమ్మలేదు సుమండీ! ఎప్పుడు వేశాడో మా వాడికి చెవిలో ఆ మందు కాస్తా ఇంకెందుకూ, 'గుండెల్లో నెప్పిలేదు, ఏమీ లేదు'అని లేచికూచున్నాడు మావాడు చక్కగా'అన్నాడు ఆమందు వేసిన ముసలాణ్ని చూపెడ్తూ.

'అరే, ఆశ్చర్యంగాఉందే నామందేమీ పని చెయ్యలేదంటారే? ఏమిటామందు మీ వాడు చెప్పిందీ?' అన్నాడు గాబరాగా.

'ఏముందీ 'నీకా అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తాం. బెంగపడకు' అని గట్టిగా వాడి చెవిలో మూడుసార్లు చెప్పి (మూడుసార్లు, సీసా కదిపి మందు పుచ్చుకొన్నట్టు) అంతకీ అనుమానం తీరకపోతే ఒట్టేయించుకున్నాట్ట. అంతే చెంగున లేచి కూచున్నాడు మంచంమీద.'

'బలే విచిత్రంగాఉందే!' అన్నాడు డాక్టరు తన మందులేవీ పని చెయ్యలేదని ముసలాడి క్కూడా నమ్మకమైపోయిందే అదే బెంగతో.

'అంతే' అన్నాడు ముసలాడు.

'అంతే' అన్నాడు రెండో ముసలాడు గర్వంగా.

'అంతే' అన్నాడు రోగి, కావలిస్తే నా గుండె చూసుకో అన్నట్టు ఛాతీవిరిచి.

'అంతే' అంది కాబోయే పెళ్ళికూతురు, ఎరుపు తెచ్చుకున్న సిగ్గుతో.

---

త్యాగీ, మహావీరుడూ! ఇటీవల ఢిల్లీపార్లమెంటులో మాటాడుతూ ఉత్తరప్రదేష్ సభ్యుడైన శ్రీ మహావీర్ త్యాగి - ఆర్థికమంత్రి జాన్ మత్తాయ్ పన్నుల ప్రణాళికను నిశితంగా విమర్శించాడు. విమర్శిస్తూ జాన్ మత్తాయ్ తన భార్యకు సైతం పన్నులద్వారా అన్యాయం చేశాడన్నాడు. "ప్రపంచంలో న్యాయం ఏమిటంటే—అవివాహితుల కంటె వివాహమై సంసారభారం మోస్తున్నవారికి పన్నుభారం తక్కువగా ఉండాలి. మత్తాయ్‌గారి బడ్జెటులో అటువంటి వివక్షత చూపించలేదు. అందుచేత ఆయన తన భార్యక్కూడా న్యాయం కలుగజెయ్యలేదు." అని విమర్శ ముగించాడు.